క్లుప్తంగా

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



పెదనందిపాడు: ఎరువుల షాపుల్లో నిర్ణయించిన ధరల కంటే ఎక్కువ ధరకు ఎరువులు విక్రయిస్తే వారిపై కఠిన చర్యలు తప్పవని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మంగళవారం మధ్యాహ్నం పెదనందిపాడులోని మనగ్రోమోర్ సెంటర్, శ్రీనివాస ఎంటర్‌ప్రైజెస్, నాగులపాడు జీడీసీఎంస్ కేంద్రాన్ని పెదనందిపాడు, అన్నపర్రు ఆర్బీకే సెంటర్‌లను ఆమె సందర్శించారు. రైతులకు నాణ్యమైన ఎరువులను అందించాలని, అనుమతి పత్రాలు ఉన్న ఎరువులను మాత్రమే విక్రయించాలని, స్టాక్ రిజిస్టర్లు పక్కాగా మెయింటిన్ చేయాలన్నారు. స్టాక్ రిజిస్టర్‌లో ఉన్న విధంగా స్టాక్ ఉండాలని ఆమె యాజమానులు, సిబ్బందికి సూచించారు. ఆమె వెంట ఏవో సుధారాణి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఓటర్ల జాబితాపై అభ్యంతరాలు తెలియజేయాలి

ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్



ప్రత్తిపాడు: ఓటర్ల జాబితాలపై అభ్యంతరాలుంటే సంబంధిత అధికారులకు వెంటనే తెలియజేయాలని గుంటూరు ఆర్డీవో, ప్రత్తిపాడు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి పి. శ్రీకర్ అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం సాయంత్రం నియోజకవర్గ స్థాయిలో రాజకీయ పార్టీల నాయకులతో సమావేశాన్ని నిర్వహించారు. ముసాయిదా జాబితాల ప్రచురణ అనంతరం తీసుకుంటున్న చర్యలపై నాయకులకు వివరించారు. ఇప్పటికే జాబితాలను పోలింగ్ కేంద్రాల వద్ద, రెవెన్యూ కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామన్నారు. మరొక్కసారి జాబితాలను పరిశీలించుకుని అభ్యంతరాలుంటే తెలియజేయాలన్నారు. ఓటర్ల జాబితాలపై ఏమాత్రం సందేహాలున్నా ఆన్‌లైన్‌లో చెక్ చేసుకునేందుకు అవకాశం ఉందన్నారు. సమావేశంలో తహసీల్దార్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విద్యార్థి ప్రతాప్‌రెడ్డికి పీహెచ్‌డీ



చేబ్రోలు: వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్సిటీలోని ఈసీఈ విభాగానికి చెందిన విద్యార్థి అంబవరం ప్రతాప్‌రెడ్డికి ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజినీరింగ్ విభాగంలో తమ యూనివర్సిటీ పీహెచ్‌డీ పట్టా అందించిందని వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'ఇన్వెస్టిగేషన్ ఆన్ బాండ్‌విడ్త్ అండ్ గేన్ ఎన్‌హ్యాన్స్‌మెంట్ ఆఫ్ మైక్రోస్ట్రిప్ ప్యాచ్ యాంటీనా ఫర్ వైమ్యాక్స్–5జీ–డబ్ల్యూలాన్ అప్లికేషన్స్' అనే అంశంపై ప్రతాప్‌రెడ్డి పరిశోధన చేశారని తెలియజేశారు. ఆయనకు విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని ఈసీఈ డిపార్ట్‌మెంట్ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.పచియానన్ గైడ్‌గా వ్యవహరించారని పేర్కొన్నారు. పీహెచ్‌డీ పట్టా పొందిన అంబవరం ప్రతాప్‌రెడ్డిని వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ పి.నాగభూషణ్, ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది అభినందించారు.

క్రీడాకారిణికి ఆర్థికసాయం

గుంటూరు మెడికల్: పవన్ జోవిత ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు మంగళవారం గుంటూరులో పలు ప్రాంతాల్లో జరిగాయి. ప్రతిభావంతులైన క్రీడాకారులకు ప్రోత్సాహ కార్యక్రమం జరిగింది. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని హిందూ కళాశాలలో ఫెన్సింగ్ క్రీడలో అఖిల భారత స్థాయి పోటీలకు ఏపీ నుంచి ఎంపికైన క్రీడా కారిణి వి.అంజలికి క్రీడా ఉపకరణాలను కొనుక్కునేందుకు ఆర్థిక సహాయాన్ని ఫౌండేషన్ అధ్యక్షుడు సీదా పవన్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ పీఎం ప్రసాద్ ద్వారా అందించారు. అందే వెంకటేష్, కొమ్మినేని రవితేజ, మురళీమోహన్, తల్లం శివ తదితరులు పాల్గొన్నారు.

నాలుగేళ్ల చిన్నారిపై వృద్ధుడు అత్యాచారయత్నం

పెదకాకాని: నాలుగేళ్ళ చిన్నారిపై వృద్ధుడు అత్యాచారానికి యత్నించిన సంఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. పెదకాకాని గ్రామంలోని ఓ కాలనీకి చెందిన చిన్నారిని మాయమాటలు చెప్పి సుమారు 70 సంవత్సరాలు వయస్సు కలిగిన వృద్ధుడు అత్యాచారానికి యత్నించినట్లు స్థానికులు గుర్తించారు. చిన్నారిని చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు బాధితుల వద్ద నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదన్నారు. గత శుక్రవారం జరిగిన ఈ సంఘటనలో నిందితుడికి దేహశుద్ధి చేసినట్లు సమాచారం.

అంబేడ్కర్ సేవలు మరువలేనివి

- ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య
- అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయాలి



పొన్నూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్. బీ.ఆర్.అంబేడ్కర్ దేశానికి చేసిన మేలు మరువలేనిదని ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య అన్నారు. సమాజంలో వ్యత్యాసాన్ని ఎలా రూపుమాపాలన్న సంకల్పంతో ఆయన మేథస్సుతో భారత రాజ్యాంగాన్ని నిర్మించి దేశానికి అందించిన ఘనత బీ.ఆర్.అంబేడ్కర్‌దేనని పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే రోశయ్య మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలను ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తూచా తప్పకుండా పాటిస్తున్నారన్నారు.

రాష్ట్రంలో ఎన్నో దశాబ్దాలుగా సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా అణచివేయబడిన వర్గాలను ముందుకు తీసుకువచ్చి రాజ్యాధికారం అందించిన వ్యక్తి సీఎం జగన్ అన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు పాలించిన నాయకుల్లో మన ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డికి సాటి ఎవరూ ఉండరన్నారు. ఆయన బలహీన వర్గాలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చి ప్రతి గ్రామంలో, ప్రతి ఇంటికీ సంక్షేమానికి పేదలను చేరువ చేశారని చెప్పారు. పేద బడుగు వర్గాలందరికీ చేయూతనిచ్చిన నాయకుడు సీఎం జగన్ అన్నారు. వీటన్నింటికీ మూలకారణం డాక్టర్. బీ.ఆర్.అంబేడ్కర్ అన్నారు. ఆయన ఆశయ సాధన కోసం విజయవాడ నగరం నడిబొడ్డున 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని స్థాపించడం జరిగిందని తెలిపారు.

చులకన చేసి మాట్లాడింది బాబే!

టీడీపీ నాయకుడు చంద్రబాబు ఎస్సీల్లో ఎవరైనా పుడతారా, బీసీల తోక కత్తిరిస్తానని చులకన చేసి మాట్లాడిన విషయం అందరికీ తెలుసన్నారు. దళిత వర్గాల గురించి చంద్రబాబు మనసులో ఏముందో ప్రతి ఒక్కరూ గ్రహించాలన్నారు. సీఎం జగన్ ప్రజలకు ఇచ్చిన హామీలను 100 శాతం నెరవేర్చి ప్రజల హృదయాల్లో పదిలంగా నిలిచారన్నారు. తన క్యాబినేట్‌లో 60 శాతం పైగా బీసీ, ఎస్సీ,ఎస్టీ, మైనార్టీలకు మంత్రి పదవులు ఇచ్చారని తెలిపారు. అన్ని కార్పొరేషన్లలో, దేవాలయ కమిటీలు, మార్కెట్ కమిటీల్లో అందరికీ 50 శాతం స్థానం కల్పించారన్నారు. అంబేడ్కర్‌కు నివాళిగా ఆయన విగ్రహం ఏర్పాటుతో పాటు విజ్ఞానం పెంపొందించేందుకు పెద్ద లైబ్రరీని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జనవరి 19న విజయవాడ పీడబ్ల్యూసీ గ్రౌండ్‌లో జరిగే అంబేడ్కర్ విగ్రహం ప్రారంభోత్సవం కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని కోరారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షులు పెరికల కృష్ణ మోహన్ మాట్లాడుతూ సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకుని విజయవాడ నడిబొడ్డున 125 అడుగుల డాక్టర్. బీఆర్. అంబేడ్కర్ కాంస్య విగ్రహం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. రూ. 3 వేల కోట్లు విలువ చేసే స్థలాన్ని ఆ స్థలాన్ని టీడీపీ హయాంలో మాజీ మంత్రి నారాయణ 100 ఏళ్ల లీజుకు తీసుకున్న విషయం ప్రజలందరికీ తెలిసిన విషయమే. ఆ లీజును రద్దుచేసి రూ. 404 కోట్లతో ప్రభుత్వం నిర్మించడం జరిగిందన్నారు. అంబేడ్కర్ ఆశయాలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్యాన్ని తీసుకువచ్చిన ఏకైక ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి అన్నారు. అనంతరం విగ్రహావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరించారు.

ప్రజలను మోసగించే పార్టీ టీడీపీయే

పేదల ఆశాజ్యోతి వంగవీటి మోహన్‌రంగా హత్యానంతరం రాజకీయంగా కాపులను అణచివేసిన ఏకైక నాయకుడు చంద్రబాబు అన్నారు. అధికారం కోసం ఎన్నో పొత్తులు కోరుకుంటున్నాడని, చాలా నియోజకవర్గాలలో దొంగ ఓట్లను చేర్చిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. దుష్ప్రచారాలతో కాలం గడుపుతున్న పార్టీ టీడీపీ అన్ని విమర్శించారు. అమరావతిని భ్రమరావతిగా మార్చిన నేతగా చరిత్రలో చంద్రబాబు నిలిచిపోయాడని మండిపడ్డారు. ప్రజా సంకల్ప యాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీల మేరకు ప్రజలను ఆర్థికంగా బలోపేతం కావాలన్న లక్ష్యంతో సంక్షేమ పథకాలను సీఎం. జగన్ అమలు చేస్తున్నారన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షులు రుద్రపాటి ఆదిశేషులు, పట్టణ అధ్యక్షులు ఎం.ఎ. మహమ్మద్, వ్యవసాయ సలహా మండలి సభ్యులు బొద్దులూరి రంగారావు, ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వర రావు, మల్లెలరాజు, సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

– ప్రజా సంకల్ప యాత్ర పూర్తి చేసి 5 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డికి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలోని డాక్టర్. వై.ఎస్. రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

అంబేడ్కర్ ఆశయాలు అమలు చేసిన నేత జగనన్న



పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న బలసాని కిరణ్‌కుమార్

- పత్తిపాడు నియోజకవర్గం సమన్వయ కర్త బలసాని కిరణ్‌కుమార్
- డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభ పోస్టర్ ఆవిష్కరణ

గుంటూరు రూరల్: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని ఆయన ఆశయాలను స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అమలు చేసిన ఏకైక నాయకుడు మన ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మాత్రమేనని పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏటుకూరులోని నియోజకవర్గం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన అంబేడ్కర్ స్మృతివనం ఈనెల 19వ తేదీన విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ప్రారంభోత్సవం సందర్భంగా ప్రాంబోత్సవ పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం సమన్వయ కర్త మాట్లాడుతూ భారతదేశ చరిత్రలో అంబేడ్కర్ భావజాలంతో అంబేడ్కర్ ఆశయాలు గ్రామ స్వరాజ్యం, బడుగు బలహీన వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన చరిత్ర సృష్టించిన నాయకుడు మన జగనన్న అని తెలిపారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో రూ.404 కోట్లతో 125 అడుగుల డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని అదే ప్రాంగణంలో స్మృతివనం, లైబ్రరీ, మ్యూజియం తదితర మాల్స్ ఏర్పాటు జగనన్న ఆధ్వర్యంలో నిర్మించటం సంతోషకరమన్నారు. భారతదేశ చరిత్రలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం నిర్మించిన ఘనత మన జగనన్నకే దక్కిందన్నారు. చంద్రబాబు హయాంలో అంబేడ్కర్ విగ్రహం నిర్మిస్తానని చెప్పి 2014లో ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీల ఓట్లతో గద్దెనెక్కి అనంతరం అదే ఎస్సీ, ఎస్టీలుగా ఎవరు పుడతారని అన్న విషయాలన్ని గుర్తు చేశారు. ప్రతి ఒక్కరూ 19వ తేదీన విజయవాడ స్వరాజ్ మైదానంలో జరిగే డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్మృతివనం ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నియోజకవర్గంలోని మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ చైర్మన్‌లు, కార్పొరేటర్లు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, జేసీఎస్ కన్వీనర్లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, అనుబంధ విభాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పారంటే .. అమలు చేస్తారంతే

- ప్రజా సంకల్పయాత్ర పూర్తయిన సందర్భంగా ఐదేళ్ల సంబరాలు
- పత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: జగనన్న మాట ఇచ్చారంటే దాన్ని అమలు చేసి తీరుతారని పత్తిపాడు నియోజకవర్గం సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ తెలిపారు. మంగళవారం ఏటుకూరులోని నియోజకవర్గం కార్యాలయంలో ప్రజా సంకల్పయాత్ర పూర్తయి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా మహానేత డాక్టర్ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారీ కేక్‌ను కట్‌చేసి స్వీట్లు పంచారు. ఈ సందర్భంగా సమన్వయకర్త మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజా సంకల్పయాత్రను చేపట్టి రాష్ట్రంలోని ప్రతి ఒక్కరినీ కలిసి వారి సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారాల దిశగా కృషిచేసి నవరత్నాల సంక్షేమ పథకాలను ప్రకటించారన్నారు. ఎన్నికల్లో అఖండ విజయం సాధించి ఏడాదిలోనే 99 శాతం ఎన్నికల హామీలను అమలు చేసిన భారతదేశ చరిత్రలో ఏకైన నాయకుడు మన జగనన్న అని తెలిపారు. సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి రెండు లక్షల మందికి ప్రభుత్వ కొలువులు అందించారన్నారు. ప్రజలకు నవరత్నాల పథకాలు అమ్మఒడి, రైతు భరోసా, జగనన్న విద్యాదీవెన, జగనన్న ఆసరా, జగనన్న వసతి దీవెన, విదేశీ విద్యా దీవెన, ఆరోగ్యశ్రీని రూ 25 లక్షలకు పెంపు, నాడు నేడు, చేనేతలకు, ఇతర వర్గాలకు వివిధ రకాల సంక్షేమ పథకాలను వలంటీర్ వ్యవస్థ ద్వారా ఇంటి వద్దకే అందించిన ఏకైక నాయకుడు మన జగనన్న మాత్రమేనని తెలిపారు. తమ కుటుంబలో మంచి జరిగితేనే నాకు ఓటు వేయండి అని మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత అడిగిన ఏకైన నాయకుడు మన జగనన్న అని తెలిపారు. అటువంటి జగనన్నకు మనమంతా అండగా ఉండాలని రానున్న ఎన్నికల్లో మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. పత్తిపాడు నియోజకవర్గాన్ని గెలిపించుకుని జగనన్నకు గిఫ్ట్‌గా అందించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా కృషిచేద్దామని పిలుపు నిచ్చారు. కార్యక్రమంలో మండల కన్వీనర్లు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్‌ల డైరెక్టర్‌లు, యార్డ్ డైరెక్టర్‌లు, చైర్మన్‌లు, సొసైటీ చైర్మన్‌లు, వార్డు సభ్యులు, గృహసారథులు, జేసీఎస్ కన్వీనర్లు, సచివాలయం కన్వీనర్లు, క్లస్టర్ ఇంచార్జ్‌లు, డివిజన్ కన్వీనర్లు వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజా ప్రతినిధులు తదితరులున్నారు.

ఆన్‌లైన్ మోసంపై కేసు

పట్నంబజారు: ఆన్‌లైన్ మోసంపై కేసు నమోదైంది. కొత్తపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాత గుంటూరు బాలాజీనగర్‌లో నివాసం ఉండే కొండేటి రామిరెడ్డి గుంటూరు నాజ్‌సెంటర్‌లోని మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తుంటారు. మంగళవారం గుర్తుతెలియని వ్యక్తి నుంచి ఫోన్ కాల్ వచ్చింది. అమ్మ ఒడికి సంబంధించి డబ్బులు జమ అయ్యాయా అంటూ, లైన్‌లో వలంటీరు ఉన్నారని నమ్మబలికి పలు మార్లు అకౌంట్ పరిశీలించాలని రామిరెడ్డిని అడగ్గా అకౌంట్, ఫోన్‌పేకు సంబంధించి పలు మార్లు ఓపెన్ చేశాడు. దీంతో రామిరెడ్డి ఖాతాలోని రూ. 46వేలు మాయమయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధురాలు మృతి

గుంటూరు ఈస్ట్: ప్రమాదవశాత్తు వృద్ధురాలు అగ్ని ప్రమాదానికి గురై చికిత్స పొందుతూ మృతిచెందిన సంఘటనపై నగరంపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నగరంలో ఏసుభక్తనగర్‌లో నివాసం ఉండే మార్తమ్మ (75) ఈనెల 2న చలిమంట వేసుకుని దగ్గరగా మంచవేసుకుని నిద్రించింది. మంటలు ఎగిసిపడి మార్తమ్మపై పడడంతో అగ్ని ప్రమాదం జరిగింది. గమనించిన కుమారుడు శివకాశయ్య, స్థానికులు మంటలు ఆర్పి చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మార్తమ్మ మంగళవారం మృతిచెందింది.మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రేపు నారాకోడూరులో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం

బజరంగ్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: సంక్షేమ సారధి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి స్ఫూర్తితో బజరంగ్ ఫౌండేషన్ సామాజిక సేవా పరంపరను కొనసాగిస్తున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ మంగళవారం తెలిపారు. జనవరి 11వ తేదీన చేబ్రోలు మండలం నారాకోడూరు గ్రామంలో బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమం శిబిరాన్ని ఏర్పాటు చేయటం జరుగుతుందని తెలిపారు.

ఈ శిబిరంలో బజరంగ్ నేత్ర జ్యోతి, బజరంగ్ మీ గుండె పదిలం, బజరంగ్ దివ్యాంగ దర్శిని, ఫిజియోథెరఫీ సేవలను ఉచితంగా అందించటం జరుగుతుందన్నారు. నేత్ర జ్యోతి వైద్య శిబిరం ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి వారం రోజుల్లో ఉచిత కళ్లజోడు అందించటం జరుగుతుందన్నారు. మీ గుండె పదిలం ద్వారా అవసరమైన వారికి యాంజియోగ్రాములు తదుపరి గుండె సర్జరీలు చేయించటం, స్టెంట్లు వేయించటం జరుగుతుందన్నారు. గ్రామంలో ఎవరైతే దివ్యాంగులున్నారో వారికి ఉచితంగా త్రివక్ర వాహనం, జైపూర్ కాలు, వెస్ట్రన్ కమోడు సమకూర్చటం జరుగుతుందని చెప్పారు.

ఆర్‌వీఆర్‌జేసీ అధ్యాపకునికి డాక్టరేట్



కృష్ణచైతన్య

గుంటూరు రూరల్: విద్యార్థులు, అధ్యాపకుల ఉన్నతికి తమ కళాశాల ఎల్లపుడూ కృషిచేస్తుందని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ డాక్టర్ కె.శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన అధ్యాపకుని అభినందన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాలకు చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.కృష్ణచైతన్యకు అన్నామలై విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసిందన్నారు. డాక్టరేట్ లభించిన అధ్యాపకుని కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, కార్యదర్శి ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ఏవో డైరెక్టర్ డాక్టర్ ఎనీ శ్రీనివాస్, డాక్టర్ ఏఎస్ ప్రసాద్ తదితరులు అభినందించారు.

సెల్‌ఫోన్ షాపులో చోరీకి యత్నం

పట్నంబజారు: సెల్‌ఫోన్ దుకాణంలో చోరీకి విఫలయత్నం చేసిన ఘటన గుంటూరు నగరంలో చోటు చేసుకుంది. సేకరించిన సమాచారం మేరకు కొత్తపేట పోలీసు స్టేషన్ పరిధిలోని శీలంవారివీధిలో ఉన్న శ్రీతిరుమల మొబైల్ షాపులో గుర్తుతెలియని వ్యక్తులు సోమవారం రాత్రి షాపు తాళాలు పగులగొట్టి చోరీకి యత్నించారు. తాళాలు రాకపోవడంతో అక్కడి నుంచి వెళ్లిపోయారు. షాపునకు సంబంధించి సీసీ ఫుటేజీలో నలుగురు వ్యక్తులు చోరీకి యత్నించినట్లు గుర్తించారు.

కంపెనీ సెక్రటరీ కోర్సులకు ఉజ్వల భవిష్యత్

నెహ్రూనగర్: ఆధునిక సమాజంలో మారుతున్న కాలనుగుణంగా కంపెనీ సెక్రటరీ కోర్సులు చదివే విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ అమరావతి చాప్టర్ సోము శివరామకృష్ణ తెలిపారు. మంగళవారం అరండల్‌పేటలో ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీ అమరావతి చాప్టర్, ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కాస్ట్ ఎకౌంటెంట్స్ ఆఫ్ ఇండియా(ఐసీఎంఏఐ)సంయుక్త ఆధ్వర్యంలో కార్పొరేట్ టాక్సెస్, ఎంఎస్ఎంఈ డైనమిక్స్, ఆర్టీఫియల్ ఇంటెలిజెన్స్ తదితర అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ది ఇన్‌స్టిట్యూట్ కంపెనీ సెక్రటరీ జాతీయ అధ్యక్షుడు మనీష్ గుప్తా మాట్లాడుతూ నేటి తరం విద్యార్థులు త్వరితగతిన విద్యాభ్యాసం పూర్తి చేసుకుని జీవితంలో నిలుదొక్కుకోవాలంటే కంపెనీ సెక్రటరీ కోర్సులను ఎన్నుకోవాలన్నారు. కంపెనీ సెక్రటరీ కోర్సు చేసిన విద్యార్థుల భవితవ్యం ఉజ్వలంగా ఉంటుందన్నారు.

జగనన్న.. మీ రుణం తీర్చుకోలేనిది



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రుణం తీర్చుకోలేనిదని, ఆయన నిండు నూరేళ్లు జీవించాలని పింఛను లబ్ధిదారులు జగన్‌కు ఆశీర్వచనాలు అందించారు. వట్టిచెరుకూరు మండలం కుర్నూతల గ్రామంలో సర్పంచ్ యర్రాకుల గోపీకృష్ణ ఆధ్వర్యంలో పింఛన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం పండుగలా జరిగింది. తొలుత ముఖ్యమంత్రి చిత్రపటానికి లబ్ధిదారులు క్షీరాభిషేకం చేశారు. అనంతరం అవ్వా తాతలు, వితంతువులకు పెంచిన మూడు వేల రూపాయల పింఛను నగదును లబ్ధిదారులకు అందించారు. అదేవిధంగా నూతనంగా పింఛను మంజూరైన లబ్ధిదారులకు వైఎస్సార్ పెన్షన్ కానుక పుస్తకాలను అందజేశారు. దేశ చరిత్రంలో ఎక్కడే లేని విధంగా ఏపీలో మాత్రమే పింఛను అధికంగా ఇస్తున్నారనీ ఇది ఒక్క జగన్‌మోహన్ రెడ్డికే సాధ్యమైందన్నారు. మా పెద్ద కొడుకు జగన్‌మోహన్ రెడ్డి ఠంచనుగా పింఛను ఒకటవ తారీకునే అందిస్తున్నారని, ఆయన రుణం ఏమిచ్చి తీర్చుకోగలమని కన్నీటి పర్యంతమయ్యారు. కార్యక్రమంలో సెక్రటరీ రవి, వెల్ఫేర్ అసిస్టెంట్ శ్రీనివాస్, వలంటీర్లు, గ్రామస్తులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. –ప్రత్తిపాడు

ప్రతి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుంది



కుటుంబ సభ్యులకు సీఎం సహాయ నిధి చెక్కును అందజేస్తున్న కిరణ్ కుమార్

కాకుమాను: కష్టాల్లో ఉన్న ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం అన్ని రకాలుగా అండగా నిలబడుతుందని నియోజక వర్గ సమన్వయ కర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మంగళవారం రాత్రి మండల కేంద్రం కాకుమానుకు చెందిన పొగర్తి పెద కోటేశ్వరరావు కుటుంబ సభ్యులకు సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల రోడ్డు ప్రమాదంలో కాకుమానుకు చెందిన పొగర్తి రమణ (55) అనే మహిళ మృతి చెందినట్లు ఆయన తెలిపారు. బాధిత కుటుంబ సభ్యులు సీఎం సహాయనిధి కోసం దరఖాస్తు చేసుకోవడంతో తొలి విడతగా రూ.2 లక్షల రూపాయలను ప్రభుత్వం మంజూరు చేసినట్లు తెలిపారు. ఆపదలో ,సమస్యల్లో ఉన్న ప్రతి ఒక్కరినీ ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా రమణ కుమారుడు పెద కోటేశ్వర రావుకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్ బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, మెరిగల మోహనరావు, నాగరాజు తదితరులు ఉన్నారు.

ఆరోగ్యసురక్ష శిబిరానికి విశేష స్పందన



వృద్ధులకు నిర్వహిస్తున్న నేత్ర పరీక్షలు



ఉచితంగా మందులు అందజేస్తున్న ఆరోగ్యసిబ్బంది

కోయవారిపాలెం (ప్రత్తిపాడు): మండల పరిధిలోని కోయవారిపాలెం గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరానికి ప్రజల నుండి మంచి స్పందన లభించింది. శిబిరానికి 148 మంది రోగులు హాజరయ్యారు. వీరికి వైద్యాధికారులు డాక్టర్ నరేంద్ర వెంకట రామారావు, డాక్టర్ ఆతియా, డాక్టర్ ఎస్. రాములు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మాత్రలు పంపిణీ చేశారు.

వారిలో తీవ్ర అనారోగ్య సమస్యలున్న వారిని మరింత మెరుగైన చికిత్స నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు. కార్యక్రమాన్ని కోయవారిపాలెం, కొండేపాడు గ్రామాల సర్పంచ్‌లు నాగమల్లేశ్వరరావు, రాంబాబులు ప్రారంభించారు. తొలుత అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈవోపీఆర్డీ నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.



రోగి వివరాలు నమోదు చేస్తున్న వైద్యులు

ఆదర్శప్రాయుడు బీఆర్ అంబేడ్కర్

- గ్రామగ్రామాన జన్ భాగీధారీ కార్యక్రమాలు
- అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళి, సంతకాల సేకరణ



ప్రత్తిపాడులో సామాజిక చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సచివాలయ ఉద్యోగులు

ప్రత్తిపాడు: డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని పాతమల్లాయపాలెం సర్పంచ్ కాసు పద్మావతి అన్నారు. విజయవాడలోని స్వరాజ్ మైదానంలో నిర్మించిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈనెల 19వ తేదీన ప్రారంభించనున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం జన్ భాగీధారి కార్యక్రమాలను నిర్వహిస్తోంది. అందులో భాగంగా మంగళవారం పాతమల్లాయపాలెంలో సర్పంచ్ కాసు పద్మావతి, ఎంపీటీసీ రమాదేవి, కొండేపాడులో నర్రా రాంబాబు, కోయవారిపాలెంలో సర్పంచ్ నాగమల్లేశ్వరరావు, ప్రత్తిపాడులో సెక్రటరీ జాన్‌పీరాలు సామాజిక న్యాయ మహా శిల్పం చిత్రపటం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సామాజిక న్యాయ విగ్రహం ఫ్లెక్సీపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ పద్మావతి మాట్లాడుతూ అణగారిన వర్గాల ఆశాజ్యోతి అంబేడ్కర్ అని కొనియాడారు.

కత్తితో దాడి ఇరువురికి గాయాలు

చేబ్రోలు: బాకీ డబ్బులు వసూలు విషయమై జరిగిన వివాదంలో కత్తితో దాడి చేయటంతో ఇరువురికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామంలో సోమవారం రాత్రి జరిగింది. స్థానిక చెరువులోపాలెంకు చెందిన మోపర్తి రమేష్‌కు వడ్లమూడి గరువుపాలెం ప్రాంతానికి చెందిన యువకుడితో డబ్బుల విషయంలో వివాదం ఉంది. ఈ నేపథ్యంలో చేబ్రోలు జీబీసీ రహదారి వద్ద ప్రత్యర్థులు కత్తితో దాడి చేయటంతో మోపర్తి రమేష్‌కు గాయాలయ్యాయి. అడ్డుకోబోయిన వేమూరి పవన్‌కు గాయాలైనాయి. క్షతగాత్రులను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో తరలించి చికిత్స అందిస్తున్నారు. చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యాసరచన పోటీల్లో విజేతలకు బహుమతులు

గుంటూరు ఎడ్యుకేషన్: శ్రీ సత్యసాయి సేవా సంస్థలతో రాష్ట్ర ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహించిన వ్యాస రచన పోటీల్లో గుంటూరు చలమయ్య–కర్నూరపు వెంకట నారాయణ డిగ్రీ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ మహంకాళి శ్రీనివాసరావు తెలిపారు. మంగళవారం సంగడిగుంటలోని కళాశాలలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ 'మానవత్వాన్ని పెంపొందించు విద్యావశ్యకత' అనే అంశంపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో వివిధ కేటగిరీల్లో విద్యార్థినులు బహుమతులు సాధించారని పేర్కొన్నారు. కళాశాల కరస్పాండెంట్ కర్నూరపు రామకృష్ణ ప్రభ మాట్లాడుతూ భగవాన్ శ్రీ సత్యసాయిబాబా విద్యాబోధనలో మానవతా విలువలకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారన్నారు.